చిటికెలో ప్రాణాలుతీసే చిటుకు వ్యాధి

మూగజీవాలను వర్షాకాలంలో అనేక వ్యాధులు సోకే అవకాశం ఉంది. అందులో అతి ప్రమాదకరమైనది చిటుకు వ్యాధి. చిటిక వేసేంత సమయంలోపే గొర్రెలు పెద్దమొత్తంలో మృత్యువాత పడతాయి. ఈ వ్యాధికి అందుకే ఆ పేరు వచ్చింది. తొలకరి వర్షాలకు మూగజీవాలు తినే పచ్చగడ్డి వల్ల క్లాస్ట్రిడియం అనే బ్యాక్టీరియా వల్ల ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకి మరణించిన గొర్రెలను శవ పరీక్ష చేస్తే మూత్ర పిండాలు మెత్తబడి గుజ్జు, గుజ్జుగా మారిపోయి ఉంటాయి. వ్యాధి సోకిన అనంతరం అతి తక్కువ సమయంలోనే మూగజీవాలు మృత్యువాత పడతాయి.

కౌడిపల్లి(నర్సాపూర్):

- లేతగడ్డివల్లే మూగజీవాలు మృత్యువాత
- వర్షాకాలంలో అప్రమత్తత అవసరం
- నివారణకు టీకా తప్పనిసరి
- మండల పశువైద్యాధికారి రాజు

జూన్, జూలై నెలలో కురిసే తొలకరి వర్షాలతో మొలకెత్తిన గడ్డి తినడంతో గొర్రెలలో చిటుకు వ్యాధి సోకుతుంది. జీవాల పోషకులు అప్రమత్తంగా ఉండి టీకా వేయించడంవల్ల ఈవ్యాధి నుంచి తమ గొర్రెలను రక్షించుకోవచ్చని మండల పశువైద్యాధికారి రాజు సూచించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి ఆయన కొన్ని


గొర్రెలు

సలహాలు, సూచనలు తెలియజేశారు.

చిటుకు వ్యాధి సోకేదిలా..

సాధారణంగా వర్షాకాలం తొలకరి వర్షాలుకురవగానే మొలకెత్తే లేత పచ్చిక తినడంవల్ల గొర్రెలకు చిటుకు వ్యాధి సోకుతుంది. వేసవిలో జీవాలు, గొర్రెలకు మేత సరిగ్గా దొరకక ఎండుగడ్డి తింటాయి. జూన్, జూలైలో తొలకరి వర్షాలు పడడంతో పచ్చిగడ్డి మొలకెత్తుతుంది. ఆ గడ్డిపై క్లాస్ట్రిడియం అనే బ్యాక్టీరియా విషపదార్థాన్ని విడుదల చేస్తుంది. దీంతో ఆలేత గడ్డిని తినడంవల్ల గొర్రెలకు చిటుకు వ్యాధి వస్తుంది.

వ్యాధి గుర్తించేలోపే..

చిటుకు వ్యాధిని గుర్తించేలోపే గొర్రెలు చిటికేసినంతలోపే ఎగిరి గంతేసి కిందపడి మృతి చెందుతాయి. లేత పచ్చిగడ్డిని గొర్రెలు ఇష్టంగా కడుపు నిండా తింటాయి. లేత గడ్డిపై బ్యాక్టీరియా విడుదల చేసిన విషపదార్థం ఉండడంతో అస్వస్థతకు గురై చిటికెలో మృతి చెందుతాయి. దీంతో జీవాల పెంపకం దారులకు తీవ్ర నష్టం సంభవిస్తుంది. ఒక్కోసారి మంద మొత్తం చనిపోయే ప్రమాదం ఉంది.


చిటుకు వ్యాధి నివారణ టీకా

అప్రమత్తంగా ఉండాలి

జీవాల పోషకులు అప్రమత్తతో ఉంటే చిటుకు వ్యాధి నుంచి గొర్రెలను రక్షించుకోవచ్చు. ఈ వ్యాధి ఆరోగ్యంగా ఉన్న గొర్రెలకే ఎక్కువగా సోకుతుంది. తొలకరి వర్షాల సమయంలో మొలకెత్తిన గడ్డిమేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గొర్రెలు అలవాటు పడేవరకు రోజుకు రెండు, మూడు గంటలకన్నా ఎక్కువగా మేపక పోవడం మంచిది.

టీకాతో రక్షణ

చిటుకు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు పంపిణీ చేస్తుంది. అవసరం మేరకు పశువైద్యులు వేస్తారు. ముందుగా నట్టల నివారణ మందు తాగించి నట్టల నివారణ అనంతరం గొర్రెలకు ముందస్తు చిటుకు వ్యాధి నివారణ టీకాలు వేయాలి. దీంతో నివారించవచ్చు.

“ ముందస్తుగా నివారణ టీకాలు



చిటుకు వ్యాధి సోకడంవల్ల జీవాల పోషకులు తీవ్రంగా నష్టం జరుగుతుంది. అందుకే ప్రభుత్వం ఈ వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు అందజేస్తుంది. మండలంలోని కౌడిపల్లి, దేవులపల్లి, లింగంపల్లి, కంచన్‌పల్లి తదితర గ్రామాలలో గతంలో చిటుకు వ్యాధి లక్షణాలు కనిపించాయి. ఈసారి ముందస్తుగా నివారణ టీకాలు వేస్తాం.

– రాజు, మండల పశువైద్యాధికారి కౌడిపల్లి

‘ఉపాధి’ నిలిపివేతపై నిరసన


మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): పెద్ద చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సంగాయిపల్లి గ్రామస్తులు అడ్డుకుంటున్నారని అంబాజిపేట ఉపాధి కూలీలు ఆందోళనకు దిగారు. సోమవారం ఉపాధి కూలీలు పనులు చేపట్టగా సంగాయిపల్లి గ్రామానికి చెందిన కొందరు రైతులు అక్కడికిచేరి చెరువు భూమిలో తమకు పట్టాలు ఉన్నాయని పనులను అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య కొద్దిసేపు ఘర్షణ చోటుచేసుకుంది. తమ భూములలో పనులను నిలిపివేయాలని ఈజీఎస్, ఎంపీడీఓ కార్యాలయంలో సంగాయిపల్లి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో ఈజీఎస్ అధికారులు పనులు నిలిపివేయడంతో అంబాజిపేట గ్రామస్తులు ఆందోళనకు దిగారు. అధికారులు వచ్చి సర్వేచేసేవరకు తాము కదిలేదిలేదని చెరువు వద్దనే గ్రామస్తులు కూర్చున్నారు. దీంతో చిన్నశంకరంపేట ఆర్ఐ చంద్రశేఖర్, సర్వేయర్‌లు అక్కడికి చేరుకుని వేచిచూసినా ఫిర్యాదు చేసిన వారు రాకపోవడంతో వెనుదిరిగారు. పెద్ద చెరువు శిఖం భూమిని సర్వేచేసి హద్దులు చూపాలని అంబాజిపేట గ్రామస్తులు అధికారులకు వినతి పత్రం అందించారు. సర్వేచేసే వరకు పనులు నిలిపివేసినట్లు ఈజీఎస్ ఏపీఓ రాజ్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

18వేల పాఠ్యపుస్తకాలు


కౌడిపల్లి ఎంఆర్‌సీకి చేరిన పాఠ్యపుస్తకాలు

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలానికి 18,342 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ బుచ్యానాయక్ తెలిపారు. మండలంలో 10ఉన్నత, 4ప్రాథమికోన్నత, 46ప్రాథమిక పాఠశాలలతో కలిపి మొత్తం 60 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 1నుండి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు 18,550 పాఠ్యపుస్తకాలు అవసరంగా గుర్తించి జిల్లా అధికారులకు నివేదిక సమర్పించారు. అందులో భాగంగా మొదటి విడతగా 18,342 పుస్తకాలు వచ్చాయి. మరో 108 పుస్తకాలు త్వరలో వస్తాయని ఆయన చెప్పారు. గ్రామాలు, తండాలలోని పాఠశాలల హెచ్‌ఎంలకు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు


కండువా కప్పుతున్న ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్: శివ్వంపేట మండలంలోని పిల్లుట్లకు చెందిన పలువురు సోమవారం బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పిల్లుట్లకు చెందిన దాసరి కృష్ణతోపాటు పలువురు నాయకులు స్థానిక తన క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరారని, వారికి పార్టీ కండువా లువేసి పార్టీలోకి ఆహ్వానించామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, పార్టీ నాయకులు సుహాసినిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

నర్సాపూర్: గత సంవత్సరం కోర్టు కేసుతో నిలిచిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను విడుదల చేయడం హర్షిస్తున్నామని పీఆర్‌టీయూ టీఎస్ మండలశాఖ ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్ అన్నారు. రాష్ట్రంలో పదివేల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేస్తూ ఈ బదిలీల షెడ్యూల్లోనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టు మంజూరు చేయాలని ఆయన కోరారు. అందుకు పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకత్వం చొరవ తీసుకోవాలని కోరారు.

12న తైబజార్ వేలం

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట పంచాయతీ తైబజార్ వేలం ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు పట్టణ ప్రత్యేక అధికారి దామోదర్, గ్రామ కార్యదర్శి నాంపల్లి తెలిపారు. బుధవారం ఉదయం 9:30కు వేలం నిర్వహించనున్నామని, ఆసక్తి ఉన్నవారు ముందుగానే వచ్చి రూ.10వేలు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

గుండె పోటుతో ఉద్యోగి మృతి



నర్సాపూర్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్తురాలు గుండెపోటుతో మృతి చెందారు. పట్టణానికి చెందిన ఉప్పరి లక్ష్మి(45 కొన్నేళ్లుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున గుండె నొప్పిగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అయితే అప్పటికే మృతిచెందారని వైద్యులు నిర్ధారించారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, 5వ వార్డు కౌన్సిలర్ సురేష్ తదితరులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టిప్పర్ల యజమానులపై కేసు

నర్సాపూర్: అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. సీఐ జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమతులు లేకుండా మూసాపేట చెరువు నుంచి మట్టినితీసి టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. అనుమతులు లేని టిప్పర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మోటారు వైరు చోరీపై ఫిర్యాదు

నర్సాపూర్: మండల ప్రజా పరిషత్తు కార్యాలయ ఆవరణలోని బోరు మోటారుకు చెందిన కేబుల్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీచేశారని ఎంపీడీఓ మధులత పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యాలయ ఆవరణలో రాత్రిపూట కొంతమంది మద్యం తాగి పరిసరాలను పాడుచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని ఆమె తన ఫిర్యాదులో కోరారు. ఎస్ఐ పుష్పరాజ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

కౌడిపల్లి డిగ్రీ కళాశాలలో చేరండి

- రెండో జాబితాలో మార్చుకునే అవకాశం
- ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్

కౌడిపల్లి(నర్సాపూర్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేవలం 15మంది విద్యార్థులు మాత్రమే దోస్త్‌లో అడ్మిషన్ పొందారని, రెండో జాబితాలో మార్చుకునే అవకాశం ఉందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.దామోదర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దోస్త్ మొదటి విడత సీట్ల కేటాయింపు పూర్తయిందన్నారు. 15 మంది మాత్రమే ఆప్షన్స్ ఇచ్చారని చెప్పారు. ఈనెల 12వరకు మొదటి విడత ఆప్షన్స్ పూర్తవుతాయని, విద్యార్థులకు రెండో విడతలో తమ కళాశాలను మార్చుకునే అవకాశం ఉందని సూచించారు. కళాశాలలో బీఏ, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ, బీజెడ్సీ, మాత్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూలై 18 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని చెప్పారు.



కౌడిపల్లి డిగ్రీ కళాశాల బోర్డు

ప్రభుత్వ పాఠశాలలు సిద్ధం


చేగుంటలో మాట్లాడుతున్న ఈఓ నాగభూషణం

- ఎంఈఓ బుచ్యానాయక్
- బడిలో చేరిన అంగన్‌వాడీ చిన్నారులు


చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లోగల అంగన్‌వాడీలలో ప్రీస్కూల్ పూర్తయిన చిన్నారులను సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో చేర్పించామని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత చెప్పారు. ఈ సందర్భంగా ఎంఈఓ బుచ్యానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు అన్ని సౌకర్యాలతో సిద్ధమవుతున్నాయన్నారు. విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు, భోజనం, పుస్తకాలతోపాటు నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వేదశ్రీ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనుబాబు, సీఆర్‌పీ రాజశేఖర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భుజిరంపేట పాఠశాలలో..

కౌడిపల్లి(నర్సాపూర్): బడిబాట కార్యక్రమంలో భాగంగా భుజిరంపేట ప్రాథమిక పాఠశాలలో 22మంది విద్యార్థులను చేర్పినట్టు హెచ్‌ఎం శంకర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ భుజిరంపేట, వెంకటాపూర్ గ్రామాలలో తిరిగి ప్రభుత్వ పాఠశాలలో వసతుల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, నరేష్, శ్రీకాంత్, నర్సింహులు, అంగన్‌వాడీ టీచర్లు సద్గుణ, మహేశ్వరి, లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్)లో..

నాణ్యమైన విద్య, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, భోజనం, యూనిఫామ్‌లు అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని


ఎంఈఓ బుచ్యానాయక్ సమక్షంలో బడిలో చేరిన చిన్నారులు


పెద్ద శంకరంపేటలో..


ఉపాధ్యాయులు కోరారు. సోమవారం మండలంలోని పోతంశెట్టిపల్లి, రంగంపేట తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. బడి మానేసిన పిల్లలను పాఠశాలల్లో చేర్చుకోవడం, ప్రైవేట్ పాఠశాలల్లోకి వెళ్తున్న వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలంటూ తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

చేగుంట(తూప్రాన్)లో..

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పంచాయతీ ఈఓ నాగభూషణం పిలుపునిచ్చారు. చేగుంటలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్, లక్ష్మణ్, మనోహర్, సుధాకర్‌రెడ్డి, రేఖ చక్రధర్‌శర్మ, పంచాయతీ సిబ్బంది లింగం, స్వామి, అంగన్‌వాడీ కార్యకర్తలు రేణుక, సుగుణ తదితరులు ఉన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్)లో..

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని, వారికి చదువు, ఆటపాటలు, నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తారని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సక్కుబాయి అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కాళ్లకల్, జీడిపల్లి అంగన్‌వాడీ టీచర్లు చిన్నారుల నమోదుపై పలు సూచనలు చేశారు.


భుజిరంపేటలో..

ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు

- వైస్ ఎంపీపీ విశ్వంభర

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలో ఇటుక బట్టీలకు ఎలాంటి అనుమతులు లేకున్నా, రెవెన్యూ అధికారులు ఆ నిర్వాహకులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వైస్ ఎంపీపీ విశ్వంభర ప్రశ్నించారు. సోమవారం మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వినోదరెడ్డి అధ్యక్షతన, ఎంపీడీఓ ఆనంద్ సమక్షంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ వెంకటేశ్వర్ మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి చెక్కులు 26 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మూడు రోజుల్లో ఇటుకబట్టీల నిర్వాహకులకు నోటీసులు అందించి, అనుమతులు లేని బట్టీలను తొలగింపజేస్తామని చెప్పారు. మండల విద్యాశాఖ అధికారి బుచ్యానాయక్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, బడిబాట కార్యక్రమం జరుగుతోందని, పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా అన్ని పాఠశాలల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం, ఫర్నిచర్ సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. మండలంలో పదోతరగతిలో మంచి ఉత్తీర్ణత శాతం సాధించామని చెప్పారు. అనంతరం ఏఓ బాల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు సంబంధిత అధికారులు ఎలాంటి అవగాహన కల్పించడం లేదని, కనీసం క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని పలువురు ఎంపీటీసీలు విమర్శించారు. విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు మాట్లాడుతూ మండలంలో చాలావరకు విద్యుత్ సమస్యలు పరిష్కరించామన్నారు. పీఆర్‌ఏఈ మధుబాబు మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల పనులు 75 శాతం వరకు జరిగాయని, త్వరలోనే వందశాతం పూర్తి చేస్తామన్నారు. గ్రామాలలో మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రావడంలేదని చిట్కుల్ ఎంపీటీసీ సుభాష్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ సురేష్‌ను ప్రశ్నించారు. చిట్కుల్ కేజీబీవీ ప్రత్యేక అధికారి అంజలి మాట్లాడుతూ కేజీబీవీలో తీవ్ర సమస్యలు ఉన్నాయని, తాగునీరు లేదని, కనీసం వంట చేయడానికి సైతం నీళ్లు రావడం లేదని, మరుగుదొడ్లు సక్రమంగా లేక విద్యార్థులు నానాఅవస్థ పడుతున్నారని వాపోయారు. ఈ విషయమై ఎంపీటీసీలు కల్పించుకుని కేజీబీవీని సందర్శించి, పాఠశాల ప్రారంభమయ్యేలోగా సమస్యలు పరిష్కరమయ్యేలా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానలు సక్రమంగా తెరవడం లేదని, తెరచిన రెండు గంటలసేపు కూడా తెరచి ఉండడం లేదని ఎంపీటీసీలు డాక్టర్ ప్రతిమను ప్రశ్నించారు. ఎంపీపీ వినోదరెడ్డి మాట్లాడుతూ అధికారులు తప్పనిసరిగా ప్రజల సమస్యలు తీర్చే విధంగా తమ విధులు నిర్వహించాలని సూచించారు. సభ అనంతరం త్వరలోనే ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండడంతో ఎంపీడీఓ ఆనంద్, మండల ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. సమావేశంలో పీఆర్‌ఏఈ మధుబాబు, ఏపీఓ శ్యామ్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత, ఏపీయం ప్రేమలత, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్

నియామకం

సంగారెడ్డి: ప్రపంచ వ్యాప్తంగా హిందీ భాషాభివృద్ధి కోసం కృషిచేసే విశ్వ హిందు పరిషత్ సంస్థ దక్షిణ భారతదేశ వ్యవహారాల బాధ్యుడిగా నారాయణఖేడ్‌కు చెందిన డాక్టర్ రవికుమార్‌గౌడ్ నియమితులయ్యారు. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ నుంచి రవికుమార్‌గౌడ్ నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్‌గౌడ్‌ను రైతు ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ అభినందనలు తెలిపారు.

నాయకుల సంబురాలు..


మనోహరాబాద్‌లో స్వీట్ తినిపిస్తున్న బీజేపీ నాయకుడు

మనోహరాబాద్(తూప్రాన్): నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని పదవి చేపట్టడంతో బీజేపీ నాయకులు సోమవారం సంబురాలు నిర్వహించారు. నరేందర్‌చారి ఆధ్వర్యంలో స్వీట్లు, పండ్లు పంచారు. అయిలయ్య యాదవ్, అజయ్, వెంకట్, నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల పాదయాత్ర

పాపన్న పేట(మెదక్): మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు విజయాన్ని పురస్కరించుకుని సోమవారం బీజేపీ జిల్లా ఓబీసీ నాయకులు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు గుమ్మడిదల నుంచి పాదయాత్రగా ఏడుపాయల అమ్మవారిని దర్శించారు. మండల అధ్యక్షుడు బి.కొండ రాములు స్వాగతం పలికారు. దుర్గా ప్రసాద్, కిష్టయ్య, రామచందర్, నాగరాజు, గౌస్ పాషా పాల్గొన్నారు.

నలుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ నలుగురికి జిల్లా కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో నలుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికీ రూ.2వేలు చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

బడిబాట విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ

- ఎంఈఓ నీలకంఠం

టేక్మాల్(మెదక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంఈఓ నీలకంఠం పిలుపునిచ్చారు. సోమవారం టేక్మాల్ ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చింతా స్వప్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 19 వరకు కార్యక్రమాలు నిర్వహించాలని, బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా నిర్వహిస్తున్న పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మండల నోడల్ అధికారి విశ్వనాథం, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ రియాజొద్దీన్, పీఆర్‌ఏఈ గోపాల్, ఎస్ఐ మురళి, ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ పాఠ శాల కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొట్టాల పంచాయతీలో ఎంపీడీఓ పల్లెనిద్ర

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాలలో ఎంపీడీఓ శ్రీనివాస్ సోమవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొని రాత్రి అక్కడే బసచేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గ్రామస్తులతో మాట్లాడుతూ పిల్లలంతాంతా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ఉత్తమ బోధన చేస్తారని చెప్పారు. గ్రామంలో మిషన్ భగీరథ తాగునీరు సరఫరా చేస్తున్నామని సమస్యలుంటే చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శి మల్లేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


తనిఖీ చేస్తున్న ఏఓ ప్రవీణ్‌చారి

కంగ్టి(నారాయణఖేడ్): నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కంగ్టి ఏఓ ప్రవీణ్‌చారి హెచ్చరించారు. సోమవారం కంగ్టిలో ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరల పట్టికలు, స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, మందులు కొనుగోలుచేసి మోసపోవద్దని రైతులకు సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే సమచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నారాయణ పాల్గొన్నారు.

సోనూ సూద్ చారిటీ సాయం

జిన్నారం(పటాన్‌చెరు): కాల్షియం తక్కువ కావడంతో ఓ వ్యక్తికి కాళ్లు చచ్చుపడిపోయిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా సోనూసూద్ చారిటీ సభ్యులు తెలుసుకున్నారు. సూర్యాపేట జిల్లా సింగిరెడ్డిపాలెంలో నివాసం ఉంటున్న ఆ బాధితుడు ఆకుల రాజు కొంతకాలంగా కాళ్లు చచ్చుపడిపోవడంతో అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న బొల్లారానికి చెందిన సోనూ సూద్ చారిటీ సభ్యుడు ప్రవీణ్‌రెడ్డి సోమవారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.